జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 29 | జులై | 2026 ◆ పేజీలు : 5



# చర్లలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటన

- సంక్షేమం, అభివృద్ధిపై ఎమ్మెల్యే సూచనలు
- 20 మందికి కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత



**చర్ల, జూలై 28 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంతో పాటు మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమలు, మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముందుగా చర్ల గ్రామంలోని

మిగతా 2 లో...



# చెరగని ముద్ర... మరువలేని నాయకత్వం..!

- అతని పరిపాలనలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ చర్చనీయాంశమే
- ఉత్పత్తి, సంక్షేమం, పర్యావరణం... మూడు రంగాల్లోనూ తనదైన ముద్ర
- కాలం మారినా.. పోలిక మాత్రం బలరాం హయాంతోనే

మాజీ సీఎండీ ఎన్. బలరాం జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం



4 లో..

# ఆమె తీరుపై... ఆక్షేపణలు..!

- జూలూరుపాడు సర్కిల్ పోలీసింగ్‌పై స్థానికంగా పెరుగుతున్న చర్చ
- సివిల్ వివాదాల్లో పోలీసుల పాత్రపై భిన్నాభిప్రాయాలు
- 'రాజీ' పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారంటూ ఫిర్యాదుదారుల ఆరోపణలు
- మధ్యవర్తుల పాత్రపై తలెత్తుతున్న సందే



హాలు

- ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న బాధితులు

# అటవీ–రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలి



2 లో...

# రైతునేస్తం 100వ ఎపిసోడ్ విజయవంతం

- ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ వ్యూహాలపై నిపుణుల సూచనలు
- పూసగూడెం రైతు వేదికలో రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్
- అత్యధికసార్లు కార్యక్రమాన్ని వీక్షించిన రైతులకు జిల్లా స్థాయిలో సత్కారం



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 28 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం మంగళవారం 100వ ఎపిసోడ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయగా, సుమారు మూడు లక్షల మంది రైతు లు వర్చువల్‌గా పాల్గొని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తెలుసుకున్నారు. 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు అనుసరించాల్సిన వ్యవసాయ వ్యూహాలు, ప్రత్యామ్నాయ పంటల

మిగతా 2 లో...

## చర్లలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటన



(మొదటి పేజీ తరువాయి...)

రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించిన ఆయన పేద , మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలు, తాగునీటి సరఫరా, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులను అడిగి తెలుసుకుని, పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలు, డ్రైనేజీల శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతునేస్తం 100వ ఎపిసోడ్ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి...)

సాగు, నీటి సంరక్షణ పద్ధతులు, చీడపీడల సమగ్ర యాజమాన్యం, పోషక నిర్వహణ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సమగ్ర అవగాహన కల్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనీ ములకలపల్లి మండలం పూసగూడెం రైతు వేదికనుండి జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో కలిసి వర్చువల్ ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం రైతులతో మాట్లా డిన కలెక్టర్, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్న శాస్త్రీ య సలహాలను రైతులు క్షేత్రస్థాయి లో అమలు చేయాలని సూచించారు. నీటి వినియోగంలో పొదుపు పాటి స్తూ, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడంలో సమర్థవంతమైన వేదికగా నిలిచిందని కలెక్టర్ అన్నారు . పంటల సాగుకు సంబంధించిన సందేహాలకు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి సమాధానాలు పొందడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడంలో ఈ కార్యక్రమం విశేషంగా ఉపయోగపడుతోందన్నారు. 'రైతు నేస్తం' కార్యక్రమం 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అత్యధికసార్లు వీక్షించిన ముగ్గురు రైతులను, కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రతిభ కనబరిచిన మరో ఇద్దరు ఏ ఈ వోలను జిల్లా కలెక్టర్ అంకిత్ జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు , వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# అటవీ–రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 28,(ప్రజాజ్యోతి)** జిల్లాలో అటవీ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన భూ సమస్యలను కేటగిరీల వారీగా వర్గీకరించి, అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలను ముందుగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అంశాలను ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో అటవీ–రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూములు, అటవీ అనుమతులు, భూ జాయింట్ సర్వే, ఆర్‌వోఎఫ్‌ఆర్ దరఖాస్తులు, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యాటక అభివృద్ధి, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని అటవీ, రెవెన్యూ సమస్యలను కేటగిరీల వారీగా విభజించి, అత్యంత ప్రాధాన్యత కలిగిన వాటిని ముందుగా పరిష్కరించాలని ఆదేశించారు. నాగుపల్లి, లచ్చగూడెం, పాల్వంచ, ఉప్పుసాక, కరకగూడెం ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను జాయింట్ సర్వే ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన బోర్‌వెల్లు, గ్రావెల్ రోడ్లు, రహదారులు, తాగునీటి పథకాలు, విద్యుత్, వైద్య సేవలు, విద్యా సదుపాయాలకు సంబంధించిన అటవీ అనుమతులను అత్యంత ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, గత ఏడాది సగటున 6 మీటర్లలో ఉన్న భూగర్భ జలాల మట్టం ప్రస్తుతం 9 మీటర్లకు పడిపోయిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్లు, మిషన్ భగీరథ, తాగునీటి పథకాల అనుమతులను అత్యవసర ప్రాతిపదికన మంజూరు చేయాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే గృహాలు ఉండి అదే స్థలంలో పునర్నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు అవసరమైన అటవీ అనుమతులు మంజూరు చేయాలని, కొత్తగా అటవీ భూముల్లో గృహ నిర్మాణాలను ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పించేందుకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనుమతులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పోడు వ్యవసాయానికి సంబంధించి కొత్తగా అడవులను నరికివేసి సాగు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అయితే ఎన్నో సంవత్సరాలుగా పోడు సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ విస్తరణకు సంబంధించిన అటవీ అనుమతులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పి రోహిత్ రాజు మాట్లాడుతూ అటవీ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులు పోడు ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీసు శాఖకు సమాచారం అందిస్తే అవసరమైన భద్రతా బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సమన్వయం పెంపొందించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాలోని ములకలపల్లి, దమ్మపేట, దుమ్ముగూడెం ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటకు సంబంధించిన కేసులు నమోదు చేశామని తెలిపారు. వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలని కోరారు. 2017 నుంచి జిల్లాలో గంజాయి సాగుకు సంబంధించిన కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.10 లక్షల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉందని తెలిపారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కొత్తగా అడవులను నరికివేయకుండా చర్యలు తీసుకుంటూనే పోడు వ్యవసాయానికి సంబంధించిన డివిజన్‌వారీ వివరాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఫేక్ ఆర్‌వోఎఫ్‌ఆర్ దరఖాస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి అంటే కేవలం చెట్లు మాత్రమే కాదని, వన్యప్రాణులు కూడా అటవీ సంపదలో భాగమని అన్నారు . సాంకేతిక పరిజ్ఞానంతో వన్యప్రాణుల సంరక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆర్‌వోఎఫ్‌ఆర్‌కు సంబంధించిన 860 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చట్టబద్ధంగా పరిష్కరిస్తామని తెలిపారు. కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం అన్ని అటవీ అనుమతులు ఆన్‌లైన్ విధానంలోనే జారీ అవుతున్నాయని, నాలుగు నెలల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అటవీ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ భద్రాచలంలోని "భద్రగిరి మార్ట్ " తరహాలో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని అన్నారు . ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖలకు సంబంధించిన ఫారం–బి అనుమతులు సకాలంలో అందకపోవడంతో సుమారు 20 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోడు వ్యవసాయానికి సంబంధించి సుమారు 1,800 దరఖాస్తులు అందాయని, దీర్ఘకాలంగా సాగు చేస్తున్న గిరిజన రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గుత్తికోయ హ్యాబిటేషన్లకు విద్యుదీకరణ కల్పించేందుకు అవసరమైన అటవీ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ బూర్గంపాడు ప్రాంతంలో అటవీ–రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వేను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న అటవీ–రెవెన్యూ కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులు, భూ సమస్యలు, అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశంలో వివరించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ వైజర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవం మోహన్ బాబు, రన్ను హుస్సేన్

- భారజల కర్మాగారంలో జరిగిన సైంటిఫిక్ అసిస్టెంట్స్ ఏకగ్రీవ ఎన్నిక





**అశ్వాపురం, జులై 28, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, హెవీ వాటర్ ప్లాంట్ మణుగూరు లో జరిగిన సైంటిఫిక్ అసిస్టెంట్స్ అసోసియేషన్ (సాస్స) ఎలక్షన్స్ ఫలితాలు ఏకగ్రీవం అయ్యాయి. ప్రెసిడెంట్ బి. మోహన్ బాబు, జనరల్ సెక్రటరీ షేక్. రన్ను హుస్సేన్ ఉపాధ్యక్షులు ఏ. శ్రీనివాసులు, ఎం. నాగేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శి డి. నవీన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంకట ప్రసాద్, వెల్ఫేర్ సెక్రెటరీ ఎం. పాండు, ఆఫీస్ సెక్రటరీ బి.ఎం.వి నాగవేంద్రరావు, కోశాధికారి జయశంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్ డి. జై సన్, సిహెచ్ వి రమణ, జి దిలీప్ కుమార్, సముద్రాల శ్రీనివాస్ ఎన్నిక అయ్యారు. ఈ ప్రక్రియ అంత కూడా ఎలక్షన్ ఆఫీసర్ బి అనిల్ కుమార్ సమక్షంలో జరిగాయి. ఈ ఏకగ్రీవ ఎన్నికల సమయంలో సహకరించిన అన్ని రకాల ట్రేడ్ యూనియన్ నేతలకు మోహన్ బాబు, రను హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. సమష్టిగా అందరిని కలుపుకొని కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలియచేశారు.

# లెజెండ్జ్ నంది అవార్డు అందుకున్న దండు సారయ్య

- సేవ కార్యక్రమాలకు దక్కిన గౌరవం
- గతంలోనూ నంది అవార్డులతో పాటు మరెన్నో అవార్డులు, సన్మానాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పురప్రముఖులు, ప్రజలు, అభిమానులు



**ఇల్లందు, జులై 28 (ప్రజా జ్యోతి)** లెజెండ్జ్ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రజా సేవ చేస్తూ వారికి అండగా నేనున్నానని భరోసా ఇస్తున్న 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యకు మంగళవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు నంది అవార్డు ను అందజేశారు. సమాజంలో ఆపదలో ఉన్న వారందరికి తనవంతు సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. అదేవిదంగా వివిధ రంగాల్లో ప్రతిభ ఉన్న కళాకారులను కూడా ఇల్లందు మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ప్రోత్సహించడం సంతోషకరమని పేర్కొన్నారు. దండు సారయ్య సమాజంలో మరెన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ కళాకారులను మరింతగా ప్రోత్సహం అందించాలని ఆకాంక్షించారు. గతంలో దండు సారయ్య సేవ కార్యక్రమాలను గుర్తించి పలు స్వచ్ఛంద సంస్థలు నంది అవార్డులతో ఎన్నో అవార్డులు అందుకోవడం, సన్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. దండు సారయ్య భవిష్యత్ లో ఇలానే సేవ కార్యక్రమాలు, కళాకారులకు ప్రోత్సహించాలని కోరారు. లెజెండ్జ్ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డును 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అందుకోవడం పట్ల పట్టణ పుర ప్రముఖులు, పలువురు కళాకారులు, 13వ వార్డు ప్రజలు, దండు సారయ్య అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# లోన్ పేరుతో మహిళకు రూ.6.70 లక్షల టోకరా

- ఫోటో మార్ఫింగ్‌తో బెదిరింపులు.. రూ.3.20 లక్షలు హోల్డ్

**బూర్గంపహాడ్, జూలై 28,(ప్రజా జ్యోతి):** లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.6.70 లక్షలు కాజేసిన సైబర్ మోసం బూర్గంపహాడ్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గౌతాపురం కాలనీకి చెందిన మహిళకు గుర్తుతెలియని వ్యక్తులు రుణం ఇప్పిస్తామని చెప్పి ఆధార్, పాన్ తదితర వ్యక్తిగత వివరాలను సేకరించారు. అనంతరం ఆమె ఫోటోను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పంపుతూ, డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ చేస్తామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు విడతల వారీగా మొత్తం రూ.6.70 లక్షలు చెల్లించినట్లు తెలిసింది.బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన బూర్గంపహాడ్ పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి, మోసగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన నగదులో రూ.3.20 లక్షలను హోల్డ్ చేయించడంలో సఫలమయ్యారు. నిందితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

**జాగ్రత్తలు పాటించాలి....** లోన్ల పేరుతో అపరిచితులకు ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు ఇవ్వొద్దని పోలీసులు సూచించారు. ఫోటో మార్ఫింగ్, సైబర్ బెదిరింపులు లేదా ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గ్రామపంచాయతీల సమస్యలపై మండల స్థాయి సమీక్ష

- అధికారులకు సీఈఓ కీలక ఆదేశాలు
- ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలి
- సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యం...జిల్లా పరిషత్ సీఈఓ





**పాల్వంచ, జూలై 28, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు ఈరోజు పాల్వంచ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో పాటు అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో గ్రామపంచాయతీల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, జలసిరి కార్యక్రమం, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.గ్రామపంచాయతీల్లో నెలకొన్న వివిధ సమస్యలను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమంలో ఫారం పాండ్ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**పాల్వంచ, జూలై 28, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని జలసిరి కార్యక్రమం కింద చేపట్టబడుతున్న ఫారం పాండ్ పనులను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీ పి. రాజారావు ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాగారం కాలనీ, పునుకుల, బిక్కు తండా గ్రామాల్లో జరుగుతున్న ఫారం పాండ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ సందర్భంగా గ్రామాల్లోని వీవో గ్రూపు సభ్యులతో సమావేశమై, జలసిరి కార్యక్రమం ప్రధాన లక్ష్యాలను వివరించారు. ఫారం పాండ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్ఏ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

- మండల ప్రత్యేక అధికారి ఎం. రమేష్




**ములకలపల్లి, జూలై 28 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఎం. రమేష్ అధ్యక్షతన సర్పంచులు, మండల స్థాయి అధికారుల సామర్థ్యాల పెంపుదల, గ్రామపంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, మంచినీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్యం, జలసిరి తదితర అంశాలపై చర్చించారు. సర్పంచులు తమ గ్రామాల్లోని అభివృద్ధి పనులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎం. రమేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వి. సత్యనారాయణ, ఎంపీఓ పి. రమేష్, వ్యవసాయ అధికారి అరుణ్ బాబు, ఎంఈవో శ్రీనివాస రావు, మిషన్ భగీరథ ఏఈ ప్రసాద్, డీటీ భాగ్యలక్ష్మి , వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మొక్కలతోనే మానవాళికి మనుగడ

- శంభునిగూడెంలో ప్రతి ఇంటికీ ఉచితంగా మొక్కల పంపిణీ
- హరిత గ్రామ నిర్మాణమే లక్ష్యం: సర్పంచ్ బట్టు శివ



**టేకులపల్లి, జూలై 28,ప్రజా జ్యోతి:** పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శంభునిగూడెం గ్రామ సర్పంచ్ బట్టు శివ పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలంలోని శంభునిగూడెం గ్రామంలో హరితహారం లక్ష్యంగా ప్రతి ఇంటికీ ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో భాగంగా నిమ్మ, జామ, ఉసిరి, నేరేడు, ఖర్జూర వంటి ఫలవృక్షాలతో పాటు చామంతి, మందారం, గులాబీ వంటి పూల మొక్కలను గ్రామ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు శివ మాట్లాడుతూ, మొక్కలు మనకు ప్రాణవాయువును అందించే జీవనాధారాలని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్కను తప్పనిసరిగా నాటాలని సూచించారు. ఫలవృక్షాలు కుటుంబాలకు పోషకాహారాన్ని అందించడంతో పాటు పూల మొక్కలు పరిసరాలను ఆహ్లాదకరంగా మారుస్తాయని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను ఇంటి సభ్యుడిలా భావించి, నీరు పోస్తూ సంరక్షించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్య త్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అన్వేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, బట్టు బాబు తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను స్వీకరించారు.



## నేడు టేకులపల్లిలో మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం

- హాజరు కాని అధికారుల వివరాలు కలెక్టర్‌కు పంపిస్తాం: ఎంపీడీవో శ్రీదేవి

**టేకులపల్లి,జూలై 28,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం (జూలై 29) ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. అలాగే గ్రామ పంచాయతీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించి సమావేశానికి హాజరై మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించాలనికోరారు.సమావేశానికి గైర్హాజరయ్యే అధికారుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీవో శ్రీదేవి స్పష్టం చేశారు.

## గంజాయి సేవిస్తే జైలు.. పునరావాసమే మార్గం

- గంజాయి సేవించిన యువకుడిని రీహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించిన టేకులపల్లి పోలీసులు

**టేకులపల్లి, జూలై 28,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని సుక్కలబోడు స్టేజీ వద్ద లారీ ఆఫీస్ సమీపంలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో టేకులపల్లి పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టేకులపల్లికి చెందిన గుగులోత్ గణేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంత రం మంగళవారం కోర్టులో హాజరుపరచగా,కోర్టు ఆదేశాల మేరకు భద్రాచలంలోని రీహాబిలిటేషన్ సెంటర్‌కు టేకులపల్లి ఎస్ఐ కె. తిరుపతి తరలించారు.పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ గంజాయి సేవించడం, విక్రయించడం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతా మని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.

## మారుమూల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- టీం సంభవ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి



**బూర్గంపహాడ్,జూలై28 (ప్రజా జ్యోతి):** మారుమూల ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో టీం సంభవ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి అన్నారు.మంగళవారం మండలంలోని బత్తులనగర్ మండల పరిషత్ పాఠశాలలో టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా బూర్గంపహాడ్ మండలంలోని బత్తులనగర్, చర్ల మండలంలోని కొండివాయి, ముల్కలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 120 మంది విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, జ్యామెట్రీ బాక్సులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి చేయూతనివ్వడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.టీం సంభవ ఫౌండేషన్ వాలంటీర్ రూప్లా నాయక్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఎక్కువ మంది విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు.కార్యక్రమంలో కృష్ణసాగర్ సర్పంచ్ తాటివాణి,ఉపసర్పంచ్ మోహన్, ఎఫ్ఎల్ఎన్ జిల్లా మానిటరింగ్ మేనేజర్ అల్లూరి రెడ్డి, మండల రిసోర్స్ పర్సన్ జగన్,ఉపాధ్యాయులు భాస్కర్, సీఆర్‌పీ శారద,అంగన్‌వాడీ టీచర్ జ్యోతి,మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు రజిత,సమ్మయ్య, నరేష్,రామకృష్ణ,మల్లేశ్వరి,రాము,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆమె తీరుపై ఆక్షేపణలు..!

- జూలూరుపాడు సర్కిల్ పోలీసింగ్‌పై స్థానికంగా పెరుగుతున్న చర్చ
- సివిల్ వివాదాల్లో పోలీసుల పాత్రపై భిన్నాభిప్రాయాలు
- 'రాజీ' పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారంటూ ఫిర్యాదుదారుల ఆరోపణలు
- మధ్యవర్తుల పాత్రపై తలెత్తుతున్న సందేహాలు
- ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న బాధితులు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 28, ప్రజా జ్యోతి**
ఆవేదనతో నలిగి ఇన్‌స్టంట్ జస్టిస్ కోసం ప్రజలు చివరి ఆశగా అడుగుపెట్టే పోలీస్ స్టేషన్.. న్యాయం కోసం వచ్చే సామాన్యుడికి ధైర్యం ఇచ్చే వేదిక కావాలి. కానీ అదే చోట ఫిర్యాదుదారుల్లో సందేహాలు, భయం, నిరాశ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తే అది ఒక్క వ్యక్తికి సంబంధించిన అంశం కాదు, మొత్తం పోలీసింగ్ తీరుకే పరీక్షగా మారుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు సర్కిల్ పరిధిలో సివిల్ వివాదాల నిర్వహణపై కొందరు ఫిర్యాదుదారులు చేస్తున్న ఆరోపణలు ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. భూమి వివాదాలు, ఫిర్యాదుల పరిష్కారంలో చట్టపరమైన విధానాల కంటే రాజీ ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే వారి వాదనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారిపై వినిపిస్తే అనుభవలేమిగా భావించే అవకాశం ఉండొచ్చు. కానీ సుదీర్ఘ అనుభవం ఉండి, చట్టానికి 15 ఏళ్ళ కిందటే 'శ్రీ'కారం చుట్టి న్యాయ'లక్ష్మి'కి చిరునవ్వు చిందించాల్సిన అధికారినే ఈ చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తే, ఆ పరిస్థితి వ్యక్తిగత విమర్శలకే పరిమితం కాకుండా ప్రజల్లో న్యాయ ప్రక్రియపై సందేహాలకు తావిచ్చే పరిస్థితిగా మారుతోంది.

### ››› ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా... "నా మాటే వినాలి"

ఫిర్యాదుదారుల కథనం ప్రకారం, ఒక కుటుంబానికి తరతరాలుగా చెందిన సుమారు 7.30 ఎకరాల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా నానమ్మ నుంచి మనవడికి సంక్రమించింది. ఎన్నో ఏళ్లుగా అతని పేరుమీదే పట్టా ఉండటంతో పాటు సాగు కూడా కొనసాగుతోంది. అయితే అదే కుటుంబానికి చెందిన మరో వ్యక్తి ఆ భూమిపై హక్కు ఉందంటూ వివాదం సృష్టించాడని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని భూమిలోకి ప్రవేశించడంతో పాటు, ఆ భూమి రెండేళ్లుగా తనవారికి కౌలుకు ఉందంటూ కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చాడని చెబుతున్నారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, చట్టపరమైన చర్యలకు బదులుగా రాజీ చేసుకోవాలనిసూచించారని ఆరోపిస్తున్నారు. తమ పేరుమీద పట్టా ఉన్నప్పటికీ, "సగం సగం పంచుకుని సెటిల్ చేసుకోండి. లేదంటే మీపైనే కేసులు నమోదు చేస్తాం" అని హెచ్చరించినట్లు వారు పేర్కొంటున్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయగా తమ మాట వినకుండా మందలించారని కూడా ఆరోపిస్తున్నారు. దాంతో పాటు వివాద పరిష్కారం కోసం స్థానిక మాజీ ఎంపీటీసీతో పాటు మరో నాయకుడిని మధ్యవర్తులుగా సూచించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు నెలలు గడిచినా సమస్యకు చట్టపరమైన పరిష్కారం చూపలేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఈ భూమికి సంబంధించి కోర్టు జారీ చేసిన ఇంజక్షన్ ఆర్డర్‌ను చూపించినప్పటికీ, "అది పనిచేయదు... మీ దగ్గర ఏ పత్రాలు ఉన్నా చివరకు నా దగ్గరకే రావాలి. నేను చెప్పిందే వినాలి" అన్నట్లుగా సంబంధిత అధికారిణి వ్యవహరించారని వారు ఆరోపిస్తున్నారు.

### ››› ఆటో డ్రైవర్, రైతు కూలీ ఆవేదన

సుమారు ఐదున్నరేళ్ల క్రితం జూలూరుపాడు–కొత్తగూడెం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భూమిలో ఒక ఆటో డ్రైవర్ రూ.6.30 లక్షలు వెచ్చించి రెండున్నర కుంటలు, మరో రైతు కూలీ రూ.11 లక్షలు చెల్లించి ఆరు కుంటలు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. కొనుగోలు చేసిన వెంటనే కంచె ఏర్పాటు చేసి, మట్టి సదును చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నామని వారు తెలిపారు. కొంతకాలానికి అసలు భూమి యజమానులైన అన్నదమ్ముల మధ్య వివాదం తలెత్తడంతో మొత్తం భూమిని స్థానిక ప్రజాప్రతినిధి కొనుగోలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తమ స్థలాలను ఖాళీ చేయించేందుకే వరుసగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో భూమి విక్రయించిన వారినే మళ్లీ రంగంలోకి దింపి కొత్త వివాదాలు సృష్టించడంతో తాము పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. అయితే అక్కడ కూడా తాము కొనుగోలు చేసిన అసలు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రాజీకి ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తున్నారు. రెండున్నర కుంటల స్థానంలో రెండు కుంటలు, ఆరు కుంటల స్థానంలో నాలుగున్నర కుంటలు మాత్రమే వచ్చేలా సెటిల్‌మెంట్ చేశారని, తమ అసలు ఫిర్యాదును పక్కనబెట్టి అంతర్గత రాజీ పేరుతో వ్యవహారం ముగించేశారని వాపోతున్నారు. అయితే ఈ అంశం అంతటితో ఆగకుండా మళ్లీ భూమి విక్రయించిన వారినే ముందుకు తీసుకొచ్చి తమపై ఒత్తిడి కొనసాగించారని, చివరకు ఓ ములన శ్మశానవాటిక సమీపంలోని ప్రాంతాన్ని చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చివరకు ఈ భూమిని కూడా ఇరకాటంలో పెట్టేల చర్యలు చేపడుతున్నారని వాపోతున్నారు. దీంతో తాము డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూమి తమకు దక్కుతుందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో కూడా చట్టపరమైన చర్యల కంటే స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ తదితరుల ద్వారా రాజీ చేసుకోవాలని సూచిస్తున్నారని, న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.



### ››› న్యాయ స్థానాలు ఎన్ని సార్లు చెప్పిన..

జూలూరుపాడు సర్కిల్ పరిధిలో భూమి వివాదాల పరిష్కారంలో పోలీసుల పాత్ర, రాజీ పేరుతో జరుగుతున్న సెటిల్‌మెంట్లు, స్థానిక మధ్యవర్తుల ప్రమేయంపై వరుసగా ఆరోపణలు వెలువడుతుండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సివిల్ స్వభావం ఉన్న వివాదాల్లో పోలీసుల జోక్యం పరిమితంగా ఉండాలని, హక్కుల వివాదాలను సంబంధిత సివిల్ కోర్టులే తేల్చాల్సిన అంశమని వివిధ సందర్భాల్లో ఉన్నత న్యాయ స్థానాలు స్పష్టం చేసినప్పటికీ, ఇక్కడ ఎప్పుడు ఇలాంటి ఆరోపణలు రావడం గమనార్హం. అయితే వీటితో పాటు ఇక్కడ వచ్చిన ఎ ఫిర్యాదుకైన సరే ముందుగ వయా మీడియా ద్వారా రాజి ప్రయత్నాలకే అవకాశం ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.
ఇందులో ప్రదానంగా స్థానికంగా ఉన్న నాయకులూ ఉంటారని, ఫిర్యాదు వచ్చిన ఎ అంశానైన ఇక్కడున్న ఆదికారిణి ఈ మధ్యవర్తులకి చేరవేసి కొంత ఆర్థిక లావాదేవిలతో సెటిల్మెంట్ వైపుగా ప్రోత్సహిస్తున్నారని స్థానికంగా చర్చ నడుస్తోంది. దీంతో ఇక్కడ ఎ సమస్యతోనైన స్టేషన్ కు వస్తే తర్వాత ఏమైతుందోనని ఫిర్యాదుదారులు భయపడుతున్నారని కొందరు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో జూలూరుపాడు సర్కిల్‌లో నమోదవుతున్న ఫిర్యాదులు, రాజీ ప్రక్రియలు, మధ్యవర్తుల పాత్రపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.



# చెరగని ముద్ర... మరువలేని నాయకత్వం..!

- అతని పరిపాలనలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ చర్చనీయాంశమే
- ఉత్పత్తి, సంక్షేమం, పర్యావరణం... మూడు రంగాల్లోనూ తనదైన ముద్ర
- కాలం మారినా.. పోలిక మాత్రం బలరాం హయాంతోనే

మాజీ సీఎండీ ఎన్. బలరాం జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (మాలోత్ అశోక్), జూలై 28, ప్రజాజ్యోతి:** సింగరేణి చరిత్రలో ఎన్నో మంది ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లు వచ్చారు. వారి హయాంలో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. అయితే కొందరి పదవీకాలం ఒక సాధారణ పరిపాలనగా ముగిసిపోతుంది. మరి కొందరి హయాం మాత్రం సంస్థ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది. అలాంటి నాయకత్వాల్లో మాజీ సీఎండీ ఎన్. బలరాం ఐఆర్ఎస్ పేరు ముందువరుసలో వినిపిస్తుందని సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. జూలై 29 ఆయన జన్మదినం సందర్భంగా ఆయన హయాంలో జరిగిన మార్పులు, తీసుకున్న నిర్ణయాలు, ఉద్యోగులతో ఏర్పరచుకున్న అనుబంధం మరోసారి చర్చకు వస్తున్నాయి.

### ♦ పరిపాలనలో వేగం... నిర్ణయాల్లో స్పష్టత

సింగరేణి వంటి భారీ ప్రభుత్వ రంగ సంస్థలో ప్రతి నిర్ణయం వేలాది మంది ఉద్యోగులు, కోట్లాది రూపాయల పెట్టుబడులు, భవిష్యత్ ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. అలాంటి పరిస్థితుల్లో నిర్ణయాలు ఆలస్యం కాకుండా తీసుకోవడం, పరిపాలనలో స్పష్టత తీసుకురావడం బలరాం హయాం ప్రత్యేకతగా నిలిచిందని అధికారులు గుర్తు చేస్తున్నారు. డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రారంభమైన ఆయన ప్రయాణం, డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు నిర్వహించి, అనంతరం సీఎండీగా సంస్థను నడిపించడం సాధారణ విషయం కాదని అంటున్నారు. ఇన్ని భాధ్యతలు నిర్వహించిన పరిపాలనలో ఎక్కడా జాప్యం లేకుండా ఫైళ్ల పరిష్కారం, విభాగాల మధ్య సమన్వయం, సమీక్షా సమావేశాల ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షించడం ఆయన పని విధానంగా ఉండేదని చెబుతున్నారు.

### ♦ ఉద్యోగి సంక్షేమమే సంస్థ బలం..

సంస్థ అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి పెరగడం కాదని, ఉద్యోగి భద్రంగా ఉంటేనే సంస్థ బలపడుతుందని నమ్మిన నాయకత్వం ఆయనది. అదే ఆలోచనతో ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేస్తున్నారు. ప్రతి ఉద్యోగికి రూ.1.25కోట్ల ఉచిత ప్రమాద బీమా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా అమలు చేయడం ఆయన హయాంలో తీసుకున్న అత్యంత కీలక సంక్షేమ నిర్ణయాల్లో ఒకటిగా చెబుతున్నారు. వైద్య సేవల మెరుగుదల, భద్రతా ప్రమాణాల బలోపేతం, ఉద్యోగులతో నేరుగా సమావేశాలు, కార్మిక సంఘాలతో నిరంతర చర్చలు, సమస్యలపై తక్షణ స్పందన వంటి అంశాలు ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచాయని పలువురు పేర్కొంటున్నారు.

### ♦ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న పరిపాలన

రోజువారీ పనులతో సరిపెట్టకుండా



రాబోయే దశాబ్దాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం బలరాం నాయకత్వంలోని మరో ముఖ్య లక్షణమని అధికారులు చెబుతున్నారు. కొత్త గనుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, ఖర్చుల నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించారని గుర్తు చేస్తున్నారు. నైని, వీకే-7, తాడిచెర్ల-2 వంటి ప్రాజెక్టుల పురోగతికి ఆయన హయాంలో వేగం పెరిగిందని, భవిష్యత్ బొగ్గు నిల్వలను దృష్టిలో పెట్టుకుని సంస్థ ప్రణాళికలు రూపొందించిందని అధికారులు చెబుతున్నారు.

### ♦ పచ్చదనానికి కొత్త దిశ

గనుల తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమనే భావనతో బలరాం పనిచేశారని పలువురు పేర్కొంటున్నారు. స్వయంగా పలుగు, పార పట్టుకుని 20 వేలకుపైగా మొక్కలు నాటడం, హరిత కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహించడం ద్వారా ఉద్యోగుల్లోనూ పర్యావరణంపై అవగాహన పెంచారని గుర్తు చేస్తున్నారు. మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల సింగరేణిలో హరిత విస్తీర్ణం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో ఆయన కృషికి జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు లభించాయని గుర్తు చేస్తున్నారు.

### ♦ పోల్చుకునే ప్రమాణంగా మారిన హయాం

ప్రతి కొత్త నాయకత్వం వచ్చినప్పుడు సహజంగానే పాత పరిపాలనతో పోలిక వస్తుంది. కానీ సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ "బలరాం హయాంలో..." అనే మాటతో చర్చలు మొదలవుతుంటే, అది ఆయన వ్యక్తిగత గుర్తింపుకంటే ఆయన పరిపాలనా ప్రమాణాలకు లభిస్తున్న గౌరవంగా సింగరేణి వర్గాలు భావిస్తున్నాయి. సమస్య చెప్పడానికి ఉద్యోగులు భయపడని వాతావరణం, నిర్ణయాల్లో వేగం, అభివృద్ధి, సంక్షేమం, పర్యావరణం... ఈ నాలుగు అంశాలను సమానంగా ముందుకు తీసుకెళ్లిన హయాంగా పలువురు మాజీ అధికారులు గుర్తు చేసుకుంటున్నారు. అందుకే జూలై 29న ఆయన జన్మదినం సందర్భంగా సింగరేణిలో వినిపిస్తున్న మాట ఒక్కటే.. 'కొన్ని పదవీకాలాలు ముగుస్తాయి... కొన్ని పరిపాలనలు మాత్రం చరిత్రలో అధ్యాయాలుగా మిగిలిపోతాయి. ఎన్. బలరాం హయాం అలాంటి అధ్యాయాల్లో ఒకటి.'

## ఆగస్టు 23న హైదరాబాద్ ముట్టడి విజయవంతం చేయాలి

- కొత్త పింఛన్ విధానం రద్దుకు ఉద్యోగ, ఉపాధ్యాయుల పిలుపు



**ఆళ్ళపల్లి. జులై28(ప్రజాజ్యోతి)** కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మర్కోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 2004 నుంచి నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న పింఛన్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం సరైన ఆర్థిక భద్రత లభించడం లేదన్నారు. ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ కంటే కూడా తక్కువ మొత్తమే అందే పరిస్థితి నెలకొనడం వల్ల ఉద్యోగులు వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పింఛన్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ నెల 11న భద్రాచలం నుంచి ప్రారంభమైన ప్రజా చైతన్య బస్సు యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల మీదుగా సాగుతూ ప్రజాప్రతినిధులను కలిసి పింఛన్ విధానం రద్దుపై వినతిపత్రాలు అందజేస్తోందన్నారు. ఆగస్టు 23న నిర్వహించనున్న హైదరాబాద్ ముట్టడి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్ విధాన బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాబూలాల్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, రమేష్, చంద్రారావు, చిన్నేశ్వరరావు, హథీరాం, లక్ష్మణ్. తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ముత్యాలమ్మ తల్లి సంబరాలు





**చర్ల, జూలై 28 : (ప్రజాజ్యోతి ):** చర్ల మండలం లింగాపురంపాడు గ్రామంలో గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి వార్షిక సంబరాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గ్రామ మహిళలు పెద్ద ఎత్తున మంచినీటి బిందెలతో తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లం దాసు, సాదం లోకనాథం, అడబాల సత్యనారాయణ, ముత్యాల రాణి, మేడిచర్ల సత్యనారాయణ, వేములపల్లి ప్రవీణ్, పున్నం వెంకటరమణ, పంజా రాజు, సాదం యుగంధర్, సాయి, కాకర్ల సత్యేంద్ర కుమార్, ముత్యాల చరణ్ తేజ, కాకర్ల సంతోష్ కుమార్, ముత్యాల సంపత్ కుమార్, సాదం శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, కుక్కల చంటిబాబు, కర్ల లక్ష్మణరావు, పూజారి కృష్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.